క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

తిరువూరు: ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని గంపలగూడెం మండలం పెదకొమెర పాఠశాల ప్రిన్సిపాల్ అన్నారు. ఈ విద్యా సంవత్సరంలో గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదో తరగతి చదివే విద్యార్థులు వచ్చే ఏడాది ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 31 వరకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. ఇతర వివరాలకు సెల్: 70329 96467 నంబరును సంప్రదించాలన్నారు.

ముగిసిన శిక్షణ

జూపూడి(ఇబ్రహీంపట్నం): జూపూడి నిమ్రా కళాశాలలో అమెజాన్ వెబ్ సర్వీస్, క్లౌడ్ కంప్యూటింగ్ అంశంపై బీటెక్ మూడో ఏడాది విద్యార్థులకు ఐదు రోజులుగా జరుగుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్ శుక్రవారంతో ముగిసింది. క్లౌడ్ కంప్యూటింగ్ ట్రైనర్ చెల్లు రామకృష్ణ క్లౌడ్ కంప్యూటింగ్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ అక్బర్‌ఖాన్, కళాశాల అకడమిక్ డైరెక్టర్ టి.నారాయణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

ఇబ్రహీంపట్నం: నిత్యం ధ్యానం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ సీఈఓ శ్రీదేవి అన్నారు. ఇబ్రహీంపట్నం ఐశ్వర్య అపార్ట్‌మెంట్‌లో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ, స్పిరిచ్యువల్ టాబ్లెట్స్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ధ్యాన శిబిరంలో ఆమె పలు సూచనలు చేశారు.

పరిశ్రమల్లో పటిష్ట భద్రతా చర్యలు

రాష్ట్ర పరిశ్రమల డెప్యూటీ చీఫ్ మేనేజర్ రాజు



మాట్లాడుతున్న రాజు

ఇబ్రహీంపట్నం: పరిశ్రమల్లో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని రాష్ట్ర పరిశ్రమల డెప్యూటీ చీఫ్ మేనేజర్ టి.రాజు అన్నారు. ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్‌లో జరుగుతున్న 54వ జాతీయ భద్రతా వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పరిశ్రమలు, పని ప్రదేశాల్లో చక్కని పర్యావరణ వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంస్థ సీఈ టి.నాగరాజు మాట్లాడుతూ పర్యావరణలో సంస్థకు జాతీయ అవార్డు దక్కేలా కార్మికులు, ఉద్యోగులు కృషి చేయాలన్నారు. ప్రమాదాల నివారణకు కృషి చేస్తామని ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు.

కార్మికులు ఒత్తిడిని జయించాలి

మైలవరం: పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు ఒత్తిడిని జయించాలని, అప్పుడే ఉత్పత్తిలో మెరుగుదల కనిపిస్తుందని కమ్యూనిటీ మానసిక ఆరోగ్య కార్యక్రమం ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ రామారావు అన్నారు. కొండపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలోని హెచ్ఐఎల్ లిమిటెడ్, సీకే బిర్లా గ్రూపు వారి ప్లాంట్‌లో శుక్రవారం నిర్వహించిన భద్రతా వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. కార్మికులు, ఉద్యోగుల మానసిక శ్రేయస్సు కోసం సైకలాజికల్ ఫస్ట్ ఎయిడ్ వంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. యూనిట్ హెడ్ ఎన్. లక్ష్మీకాంత్, ఈహెచ్ఎస్ మేనేజర్ అమన్‌దీప్, డాక్టర్ శరణ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి దిక్సూచి వంటిది



ముసునూరు: ఉపాధ్యాయ వృత్తి సమాజానికి దిక్సూచి వంటిదని నూజివీడు డీవైఈఓ సేవియా నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని వేల్పుచర్ల హైస్కూల్లో ఉద్యోగ విరమణ చేసిన ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు కేవీ నారాయణరావు సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హెచ్ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు నారాయణరావు దంపతులను సత్కరించారు. ఎస్ఎంసీ చైర్మన్ నాగబాబు, ఉప సర్పంచ్, గోపవరం హెచ్ఎం నాగేంద్రరావు పాల్గొన్నారు.

హిందీ మహాసభ ప్రచారక్ రేపాకకు సన్మానం

తిరువూరు: హిందీ భాషాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న దక్షిణ భారత హిందీ మహాసభ ప్రచారక్ రేపాక రఘునందన్‌ను తిరువూరు సర్వోదయ స్కూల్‌లో శుక్రవారం ఆంధ్ర సర్వోదయ సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. 34 సంవత్సరాలుగా విద్యార్థులకు హిందీ బోధిస్తూ, దక్షిణ భారత హిందీ ప్రచార సభ నిర్వహించే వార్షిక పరీక్షలు రాయించడంలో కృషి చేయడమే కాక, భారతదేశం నా మాతృభూమి ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు జీవిత చరిత్రను తెలుగు, హిందీ భాషల్లో రచించారని పలువురు కొనియాడారు. సంఘ చైర్మన్ వైబీవీఎస్ఎస్ మూర్తి, కరస్పాండెంట్ రమణమూర్తి, ప్రసాదరావు అభినందించారు.

స్టేట్ టాపర్‌గా త్రివిధ విద్యార్థిని



నూజివీడు: ఇండియన్ బ్రిలియంట్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో పట్టణంలోని త్రివిధ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. 8వ తరగతికి చెందిన ఎస్.దివ్య రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ సబ్బినేని శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. జిల్లా టాపర్లుగా ఎస్.గీతిక (9వ తరగతి), టి. హేమ (8వ తరగతి), సుమతి (7వ తరగతి) నిలిచారు. వీరు శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో బహుమతులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

ఆలయ ప్రతిష్ఠా ఉత్సవాలు ప్రారంభం



తిరువూరు: స్థానిక దాసాంజనేయస్వామి ఆలయ పునః ప్రతిష్ఠ ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆలయ పునర్నిర్మాణం అనంతరం శిఖర, ధ్వజస్తంభ, మూల విరాట్ ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్తంగా పూజాదికాలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో విశేష హోమాలు జరిపారు. అగ్నిప్రతిష్ఠ, విగ్రహాలకు క్షీరాదివాసం, నిత్య పూర్ణాహుతి నివేదన, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ కార్యక్రమాలు జరిగాయి. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెల్లంకి సురేంద్ర బాబు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కొల్లిపర సుబ్బారావు, సంకా రాంబాబు, గోపాల్ పర్యవేక్షిస్తున్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

జి.కొండూరు: ఆయిల్, గ్యాస్ వంటి వాటి వల్ల ఏర్పడే అగ్ని ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బీపీసీఎల్ సేఫ్టీ అధికారి లోహిత్ కుమార్ అన్నారు. భద్రతా వారోత్సవాల్లో భాగంగా బీపీసీఎల్, గ్యాస్ సంస్థ పినపాక వారి ఆధ్వర్యంలో చెవుటూరు జెడ్పీ హైస్కూలు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు ఎలా జరుగుతాయి, వాటిని ఎలా నివారించాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రయోగాత్మకంగా బీపీసీఎల్ సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు భద్రత నివారణ చర్యలపై పరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం కేఎస్‌జే లక్ష్మి, బీపీసీఎల్ ఇంజినీరింగ్ విభాగం అధికారి డి. పవన్ కల్యాణ్ పాల్గొన్నారు.

సర్వేల భారం తగ్గించాలని వినతి

తిరువూరురూరల్: ఇతర శాఖలకు సంబంధించిన సర్వేలు తమకు అప్పగించవద్దని వైద్యారోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాజుగూడెం, చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు శుక్రవారం వినతిపత్రాలు సమర్పించారు. వారు మాట్లాడుతూ తమకు ఆరోగ్య శాఖాపరమైన సర్వేలతోనే అధిక సమయం సరిపోతున్నందున పీ ఫోర్ సర్వే, ఇళ్ల పన్నుల వసూలు, ఎంఎస్ఎంఈ, ఇళ్ల జియో ట్యాగింగ్, వలస కుటుంబాల నమోదు, ఇతర శాఖల వర్క్ ఫ్రం హోం, ఈకేవైసీ సర్వే, ఆధార్ లేని పిల్లల వివరాల సేకరణ, ఎన్‌సీడీ, ఆర్‌సీహెచ్, ఇమ్యూనైజేషన్, ఫీవర్ సర్వే, ఎన్ఎల్ఈపీ, శానిటేషన్, డ్రైడే ఫ్రైడే, ఏఎన్ఎం ఏపీ హెల్త్ యాప్ సర్వేలు, గర్భిణులకు సేవలు, కిశోర బాలికలకు టెస్టులు చేయించడానికి 24 గంటల సమయం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యారోగ్య శాఖ సర్వేలు తప్ప ఇతర శాఖల సర్వేల నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని పీహెచ్‌సీల వైద్యాధికారులు శ్రావ్య పూర్ణిమ, భవానీలకు వినతిపత్రాలు అందజేశారు.

మొక్కజొన్న పంటల పరిశీలన

నూజివీడు: వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ నిరంతరం సరఫరా చేయాల్సి ఉన్నప్పటికీ మరమ్మతుల పేరుతో కోతలు విధిస్తుండటంతో పంటలు చేతికి వచ్చే పరిస్థితి లేకుండా పోతోందని సీపీఐ నాయకులు నిమ్మగడ్డ నరసింహ, బొప్పూడి రాంబాబు అన్నారు. మొర్సపూడి, తుక్కులూరు, జంగంగూడెం తదితర గ్రామాల్లో మొక్కజొన్న పంటలను శుక్రవారం వారు పరిశీలించి మాట్లాడారు. పంటలు చేతికి వచ్చే సమయంలో విద్యుత్ సరఫరా సరిగా చేయకపోవడంతో దిగుబడులు దారుణంగా పడిపోయే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. 9 గంటల పాటు నిర్విరామంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

డ్రోన్ టెక్నాలజీపై వర్క్‌షాపు ప్రారంభం

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీలో నిర్వహించనున్న సాంకేతిక సంబరం టెక్ జైట్–25లో భాగంగా 'డ్రోన్ అండ్ మానవ రహిత వైమానిక వాహనం' అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్ శుక్రవారం ప్రారంభమైంది. ఇగ్నైటెడ్ మైండ్స్ ఆర్గనైజేషన్ చైర్మన్ పెనుబడి చరణ్ విద్యార్థులకు గెస్ట్ లెక్చర్ ఇచ్చారు. తొలి రోజు డ్రోన్, దాని ప్రాథమిక సూత్రాలు, ఉపయోగాలపై అవగాహన కల్పించారు. మానవ రహిత వైమానిక వాహనం టెక్నాలజీ వెనుక ఉన్న శాస్త్రీయత, మెకానికల్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్ రంగాల్లో ఉన్న అవకాశాలను వివరించారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

నూజివీడు: జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం పట్టణంలోని కోర్టు భవనాల ఆవరణలో ఈ నెల 8న నిర్వహిస్తామని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ శుక్రవారం తెలిపారు. రాజీ చేయదగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, మోటర్ యాక్సిడెంట్ కేసులు కక్షిదారులు రాజీమార్గంలో పరిష్కరించుకోవచ్చన్నారు.

10 లీటర్ల సారా స్వాధీనం

నూజివీడు: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని హనుమంతులగూడెంలో ఏలూరు ఏఈఎస్ సీహెచ్ అజయ్‌కుమార్ సింగ్ ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం నిర్వహించిన దాడుల్లో 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన భూక్యా రాములమ్మ వద్ద సారాను స్వాధీనం చేసుకున్నారు. ఆమెకు సారా సరఫరా చేసిన నూజివీడు మండలం సిద్ధార్థ నగర్‌కు చెందిన మరో వ్యక్తిపై కూడా కేసు నమోదు చేశారు.

1,600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

చాట్రాయి: మండలంలోని పోతనపల్లి చినతండాలో శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి 1,600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు.

విశిష్ట సంఖ్య తప్పనిసరి

నూజివీడు: వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే పథకాలు, రాయితీలు అందాలంటే ప్రతి రైతు విశిష్ట సంఖ్య తప్పనిసరిగా పొందాలని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. తుక్కులూరు, జంగంగూడెంలోని రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది నిర్వహిస్తున్న ఫార్మర్ రిజిస్ట్రీలో రైతుల వివరాల నమోదు ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల వ్యవసాయాధికారి చాముండేశ్వరి, రైతు సేవా కేంద్రం సిబ్బంది చంటిబాబు, రక్షిత, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల తనిఖీలు

తిరువూరు: గంపలగూడెం మండలంలో శుక్రవారం విద్యుత్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అక్రమ విద్యుత్ వినియోగదారులపై రూ.5 లక్షల 66 వేల 800 జరిమానా విధించారు. 2,283 విద్యుత్ కనెక్షన్లను తనిఖీ చేయగా పరిమితికి మించి లోడు వినియోగించడం, అనుమతి లేకుండా విద్యుత్ వాడకందారులపై ఈ అపరాధ రుసుం విధించామని గంపలగూడెం విద్యుత్ ఏఈ వాసు తెలిపారు. విద్యుత్ డీఈ విజయలక్ష్మి, ఈఈ సత్యనారాయణ, తిరువూరు ఏడీఈ రామకృష్ణ, పలు డివిజన్ల ఏఈలు, సిబ్బంది తనిఖీలో పాల్గొన్నారు.



ప్రకటన



ప్రకటన

పశువులకు టీకాలు

తిరువూరు: గంపలగూడెం మండలం మేడూరులో శుక్రవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామని గంపలగూడెం పశువైద్యాధికారి అభిలాష్ తెలిపారు. 92 ఆవులకు, 108 గేదెలకు టీకాలు వేశామని చెప్పారు. పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులు, నివారణ చర్యలపై పశు యజమానులకు అవగాహన కల్పించామన్నారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ

ముసునూరు: పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు సూచించారు. గోపవరం జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి ఓర్పు, క్రమశిక్షణ, పట్టుదలతో చదివి విజయం సాధించాలని సూచించారు.



ఉపాధ్యాయినులకు సన్మానం



నూజివీడు: మహిళలు దేశాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని గొల్లపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని పొట్లూరి రాధికారాణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని హైస్కూల్‌లో శుక్రవారం హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయినులు జల్లు లక్ష్మి, మల్లేశ్వరి, కృష్ణవేణి, కోటేశ్వరమ్మ, మనోహరం, సౌజన్య, విజయలక్ష్మి, లక్ష్మీప్రసన్నను సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలి

మైలవరం: గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై బాలికలకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని విజయవాడ నిర్భయ క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు అబ్బూరి రత్నలక్ష్మి అన్నారు. పుల్లూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మెయిన్‌లో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పారా సైకాలజిస్టు ప్రొఫెసర్ కృష్ణారావు మాట్లాడుతూ ఆడపిల్లలు ఏమి చేస్తున్నారని తల్లిదండ్రులు వారి కార్యకలాపాలపై దృష్టి పెట్టాలని సూచించారు. అమ్మాజీ, ఎస్ఎంసీ చైర్మన్ కొనకాల చిన్న నరసింహారావు, హెచ్ఎం కేవీ లక్ష్మీనాంచారమ్మ పాల్గొన్నారు.

మహిళలకు ఏదైనా సాధించగల సత్తా ఉంది



నూజివీడు: మహిళలు ఏదైనా సాధించగల సత్తా కలిగి ఉన్నారని ఎమ్మార్ అప్పారావు కాలేజీ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేషన్ ప్రిన్సిపాల్ జె. నవీన లావణ్యలత అన్నారు. కృష్ణా యూనివర్సిటీకి చెందిన స్థానిక ఎమ్మార్ అప్పారావు పీజీ సెంటర్‌లో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహిళలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ షేక్ అన్వర్ బాషా, నాగరాజు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

టైలరింగ్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిరువూరు: వివిధ కార్పొరేషన్ల ద్వారా మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తిరువూరు ఎంపీడీఓ రవిబాబు తెలిపారు. బీసీ, కాపు, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా 18 నుంచి 50 సంవత్సరాల లోపు మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆధార్ కార్డు, తెలుపు రేషన్ కార్డు, పాస్‌పోర్టు ఫొటోతో ఆన్‌లైన్‌లో కానీ వార్డు, గ్రామ సచివాలయాలలో కానీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

స్వయం సిద్ధ రుణ మంజూరు పత్రాల పంపిణీ

తిరువూరు: స్థానిక భారతీయ స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచిలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎస్బీఐ శక్తి సమర్థ దివస్ నిర్వహించారు. మహిళలకు ప్రత్యేక రుణమేళా నిర్వహించి స్వయం సిద్ధ పథకం కింద 58 మంది మహిళా లబ్ధిదారులకు రూ.98 లక్షల రుణ మంజూరు పత్రాలను ఆర్డీఓ మాధురి అందజేశారు. అనంతరం మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు తాళ్ళూరి రామకోటేశ్వరరావు, సుజాత, కార్తీక 47 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎస్బీఐ శాఖా మేనేజరు రవికుమార్, ఫీల్డ్ ఆఫీసర్ గోపీనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.